# 72వ స్వాతంత్ర్య దినోత్సవ సందేశము

విజయవాడ నగర ప్రజలకు, పురప్రముఖులకు, పోలీస్ సిబ్బంది, అధికారులకు, పోలీస్ కుటుంబాలకు, హోంగార్డులకు, మీడియా మిత్రులకు, అధికార, అనధికార ప్రముఖులకు, ఇక్కడకు విచ్చేసిన అందరికీ ధన్యవాదాలు, 72వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.

ఈ రోజు మనం ఈ ఉత్సవాలు జరుపుకోవడం వెనుక దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన ఎందరో మహానుభావుల కృషి దాగి ఉంది. దేశ స్వాతంత్ర్యం కోసం వారు చేసిన త్యాగాలను మరచిపోకుండా గుర్తు చేసుకుంటూ వారందరికి నివాళి అర్పిద్దాం. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అత్యంత అవసరమని గుర్తించి మనం సమర్ధవంతమైన విధి నిర్వహణ ద్వారా ప్రజలకు భద్రతను కల్పించి, భద్రతా భావాన్ని పెంపొందించగలిగితే వారిలో సంతోషం, మానసిక స్థైర్యం చూడగలం. పోలీస్ శాఖ ప్రజల రక్షణకే ఉందన్న ప్రగాఢ విశ్వాసాన్ని కలిగించి, అత్యుత్తమ సేవలే లక్ష్యంగా పోలీస్ అధికారులు, సిబ్బంది పని చేయాలి.

పోలీసు ఉద్యోగంలో సవాళ్ళు మామూలే. వాటిని సమయస్ఫూర్తి, నేర్పుతో అధికమిస్తూ, చట్టాన్ని సక్రమంగా వినియోగించుకుని ముందుకు వెళ్ళాలి. నూతన అమరావతి రాజధానిలో భాగంగా ఉన్న నగరంలో పరిష్కరించాల్సిన మరియు పరిశోదించాల్సిన ఛాలెంజ్‌లు, డిమాండ్‌లను అలాగే నగర ప్రజలు పోలీస్ శాఖాపరంగా ఆశిస్తున్న అనేక అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రాధన్యతా క్రమంలో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకమైన పాలన అందించడం ద్వారా పోలీస్ మరియు ప్రజల మధ్య తత్సబంధాలు, స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేయడం జరుగుతుంది. ఈ క్రమంలో నగరంలో శాఖాపరమైన ప్రణాళికలు, విధానాలను సమీక్షించుకుంటూ పురోగతి సాధించాలి.

మహిళలు, బాల బాలికల సమస్యల పరిష్కారం కోసం ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. మహిళలు, బాలలకు సంబంధించి పోలీస్ శాఖ అమలు చేస్తున్న సామాజిక చైతన్య కార్యక్రమాలను మరింత పటిష్టం చేసి ముందుకు తీసుకెళ్ళడం జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అలాగే డిజిపి గారు కూడా మహిళలు అదే విధంగా బాలల సమస్యల పరిష్కారం, మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇచ్చి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరిగింది.

పోలీసుల విధి నిర్వహణలో చట్టం ప్రముఖ పాత్రవహించే ముఖ్యమైన ఆయుధం వంటిది. చట్టాన్ని సక్రమంగా వినియోగించకుండా దగ్గర దారుల్లో వెళ్ళాలంటే భవిష్యత్తులో సమస్యలు ఉత్పన్నమవుతాయి. మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా పోలీసు అధికారులు మరియు సిబ్బంది ఎప్పటికప్పుడు వృత్తి నైపుణ్యం మెరుగుపర్చుకుని చురుగ్గా వ్యవహరించాలి. పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ పోలీసు సేవలను విస్తృతం చేయాలి. ప్రజలు కూడా పోలీస్ శాఖకు తోడ్పాటునందించడం ఒక సామాజిక బాధ్యతగా గుర్తుంచుకుని సహకారం అందించాలి. ప్రజల ప్రోత్సాహం, సహకారం ఉంటే పోలీసులు మరింత సమర్ధవంతంగా మెరుగైన సేవలు అందించడానికి ఆస్కారం ఏర్పడుతుంది.

*(మిగతా 2వ పేజీలో...)*

**శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ :**

నగరంలో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా జీవించేందుకు, శాంతి భద్రతలు పరిరక్షించి, విజయవాడను సురక్షిత మరియు నేర రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు శాఖాపరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుంది. నగరంలో రౌడీలు, గూండాలు, సమాజానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను, వివిధ నేరాలకు పాల్పడే నేరగాళ్ళను ఉపేక్షించకుండా వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకొని విధుల్లో రాజీలేకుండా ముందుకు వెళ్ళడం జరుగుతుంది. క్లిష్టమైన శాంతి భద్రతల సమస్యలు ఏమైనా ఉత్పన్నమైతే వెంటనే స్పంధన, వెనువెంటనే చర్యలు తీసుకొనేలా పోలీస్ శాఖ నిరంతరం భాద్యతగా మరియు సమర్ధవంతంగా విధులు నిర్వహించేలా పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ప్రతి రోజు సైబర్ నేరాలు జరుగుతూనే ఉన్నాయి. వివిధ వర్గాల వారు ఏదో ఒక విధంగా సరైన సాంకేతిక విజ్ఞానం లేకపోవడం వలన సైబర్ నేరాల భారిన పడుతున్నారు. విద్యావంతులు కూడా ఉచ్చులో పడటం సైబర్ నేరాల తీవ్రతకు నిదర్శనం. డీమోనిటైజేషన్ తర్వాత ఆర్ధిక లావాదేవీలే కాకుండా, ఆన్‌లైన్ లావాదేవీలు పెరగడంతో సైబర్ నేరాలు కూడా కొంత మేరకు పెరిగాయి. సైబర్ నేరాలు జరిగిన తరువాత దర్యాప్తు చేసేకంటే, అవి జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అడ్డుకట్ట వేయాలి.

వ్యవస్థలో జరుగుతున్న సైబర్ నేరాలపై దృష్టి సారించి ప్రజలెవరూ సైబర్ మోసాలకు గురికాకుండా ఉండేందుకు పలు చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ నేపథ్యంలో సైబర్ నేరాలను సమర్ధవంతంగా ఎదుర్కొనడానికి రాష్ట్ర ప్రభుత్వం మరియు ఏపి డిజిపి గారి సహకారం, చొరవతో అలాగే సైబర్ పోలీస్‌స్టేషన్ ఆవశ్యత గురించి కొంత కాలంగా ప్రజల నుండి వచ్చిన విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకుని విజయవాడ నగరంలో మొట్టమొదటిగా సైబర్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. తద్వారా ప్రత్యేకంగా వివిధ రకాల సైబర్ నేరాలను పరిశోధించి దర్యాప్తు చేయడానికి అస్కారం ఏర్పడింది.

ముఖ్యంగా సైబర్ నేరాలు, ఆర్ధికపరమైన నేరాలు, మోసాల గురించి అదే విధంగా సాధరణంగా జరిగే దొంగతనాల గురించి ప్రజలను అప్రమత్తంగా చేస్తూ వీటిపై అవగాహన కలిగించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఉచితంగా డబ్బు వస్తుందని తెలిపే ఫోన్ కాల్‌లను, వెబ్‌సైట్లను ముఖ్యంగా మహిళల స్వరంతో వచ్చే ఫోన్ కాల్‌లను నమ్మి, మీ వివరాలు సంబంధిత వ్యక్తులకు అందించి ఆర్ధికంగా మోసపోవద్దని ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను.

**ఇంటర్‌సెప్టర్ వాహనాలు :**

విజుబుల్ పోలీసింగ్‌లో భాగంగా సత్వర స్పందన, వేగవంతమైన చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజలకు పోలీస్ శాఖ ద్వారా మెరుగైన సేవలు అందించడానికి వీలుగా, డిజిపి గారి చొరవ, సహకారంతో నూతనంగా 12 ఇంటర్‌సెప్టర్ వాహనాలను ప్రారంభించడం జరిగింది. పోలీస్ ఔట్‌పోస్టు మాదిరిగా నిర్దేశించిన 12 ప్రదేశాల్లో 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంచడం వలన చుట్టు ప్రక్కల ప్రజలకు ఏదైనా సమస్య ఉత్పన్నమైనప్పుడు ఇంటర్‌సెప్టర్ వాహనం వద్దకు వచ్చి వారి సమస్యలను తెలియజేసేందుకు ఆస్కారం కలుగుతుంది.

*(మిగతా 3వ పేజీలో...)*

**వాట్సప్ నంబరు :**

అలాగే ప్రస్తుతం నగర పోలీస్ శాఖ వినియోగిస్తున్న యాప్‌లకు అదనంగా వివిధ సంఘటనలు, సందర్భాల గురించి ప్రజా ఫిర్యాదులు, ట్రాఫిక్ అవాంతరాలకు సంబంధించి సమాచారం గురించి, వీడియో, ఫొటో, టెక్స్ట్ మెసేజ్ రూపంలో తెలియజేసేందుకు క్రొత్తగా వాట్సప్ నంబరు-7328909090ను ప్రారంభించి ప్రజలకు అందుబాటులో ఉంచడం జరిగింది.

**కాల్‌మనీ :**

కాల్‌మనీ, అధిక వడ్డీల పేరుతో ప్రజలను ఇబ్బందిపెట్టడం, వేధింపులకు మరియు భయభ్రాంతులకు గురి చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు. అటువంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఇటువంటి కేసులో ఇతరుల జోక్యానికి తావులేదు. కొంత మంది వ్యక్తులు అవసరాల నిమిత్తం చేబదులుగా డబ్బు తీసుకుని వాటిని కాల్‌మనీగా సృష్టించి తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నట్లు గమనించడం జరిగింది. కాల్‌మనీ కేసుల్లో పోలీసు దృష్టికి వచ్చిన కేసులను పూర్తిగా విశ్లేషించి ఆయా కేసులు చట్టపరిధిలో పరిష్కరించదగినవి అయితే నిజమైన బాధితులకు న్యాయం చేయడానికి కృషి చేయడం జరుగుతుంది. స్తోమతకు మించి అప్పులు చేసి భవిష్యత్తులో ఇబ్బందులు పడవద్దని ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను.

**భూవివాదాలు :**

అమరావతి రాజధానిలో భాగంగా ఉన్న విజయవాడ నగరంలో భూవివాదాలకు సంబంధించిన వివాధాలు ప్రత్యేకమైనవి. సిఆర్‌డిఏ పరిధిలోకి విజయవాడ నగరం చేరిన అనంతరం జరిగిన పరిణామాలలో చాలా వరకు మార్పు వచ్చింది. భూముల ధరలు రెట్టింపు స్థాయిలో పెరగడం, ఇతర ప్రాంతాల నుండి నగరానికి ప్రజలు వలసలు రావడంతో కొందరు వ్యక్తులు భూములు లేకుండానే న్యాయస్థానల్లో వాజ్యం వేయడం, భూములను ఆక్రమించడం, అసలు భూమే లేకుండా ఇతరులకు విక్రయించడం లాంటి సంఘటనలు కొన్ని గమనించడం జరిగింది. ఈ తరహా కేసులను పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

**ట్రాఫిక్ :**

విజయవాడ ఎక్కువ జనసాంధ్రత కలిగిన నగరాల్లో ఒకటిగా ఉంది. అమరావతి రాజధానిలో భాగంగా విజయవాడ రూపుదిద్దుకుంటున్న తరుణంలో ప్రముఖులు, మంత్రులు మరియు ప్రభుత్వ అధికారుల రాకపోకలు పెరిగాయి. అలాగే విజయవాడ కేంద్రంగా కొన్ని పరిపాలనా కార్యక్రమాలు జరగడం, వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఇక్కడకు వచ్చి స్థిరపడటం తద్వారా ఒక్కసారిగా ఉహకందని విధంగా వాహనాల సంఖ్య పెరగడంతో నగర రోడ్లు రద్దీగా మారాయి. ముఖ్యంగా రెండు జాతీయ రహదారులు నగరం మీదుగా వెళ్ళడం కూడా ట్రాఫిక్ రద్దీకి మరొక కారణంగా ఉంది. నగరాభివృద్దిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండు ఫ్లైఓవర్ (కనకదుర్గా ఫ్లైఓవర్ మరియు బెంజ్‌సర్కిల్ ఫ్లైఓవర్) నిర్మాణాల వలన ట్రాఫిక్ క్రమబద్దీకరణ పోలీసులకు పెను సవాలుగా మారింది. ఇన్ని ప్రతికూల పరిస్థితుల్లో ట్రాఫిక్ పోలీసులు ఎంతో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ విధులు నిర్వహిస్తున్నారు. రెండు ఫ్లైఓవర్ నిర్మాణాలు పూర్తయితే నగరంలో ట్రాఫిక్ సమస్య చాలా వరకు అదుపులోకి వస్తుంది.

*(మిగతా 4వ పేజీలో...)*

ముఖ్యంగా ట్రాఫిక్‌కు సంబంధించి రహదారుల వినియోగించుకునే విధానం, ట్రాఫిక్ నిబంధనలు, ట్రాఫిక్‌లో నూతన ప్రణాళికలు, విధానాలను రూపొందించడం, ప్రజల్లో ట్రాఫిక్ పట్ల అవగాహన తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని క్షుణ్ణంగా అధ్యయం చేయవలసి ఉంది. ప్రజల అవసరాలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ అవాంతరాలను నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకుంటాము. ట్రాఫిక్ అనేది ప్రతి పౌరునికి సంబంధించిన అంశం. మానవ తప్పిదాల వలన ట్రాఫిక్ నియమాలు పాటించకుండా అనేక మంది రోడ్డు ప్రమాదాల భారిన పడి తమ విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ప్రజలు క్రమశిక్షణ పాటిస్తూ ట్రాఫిక్ నియమాలు పాటించాలి. తద్వారా ట్రాఫిక్ సమస్య సులభతరం అవడంతో పాటు రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడతాయి.

## సిబ్బంది సంక్షేమం :

**ప్రతి నిత్యం అనేక వత్తిడులు, క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది సంక్షేమం మరియు సమస్యలను పరిష్కరించటానికి శాఖా పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. పోలీస్ సిబ్బంది తమ సమస్యలను తెలియజేయడానికి అందుబాటులో ఉంటామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.**

శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్దీకరణలో క్షేత్రస్థాయిలో సిబ్బంది మొదలుకొని, అధికారుల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటూ అప్పగించిన పనిని గురుతరమైన బాధ్యతతో నిర్వహించాలి. పోలీసులు ప్రజలపట్ల స్నేహభావంతో, సానుభూతితో వ్యవహరించి వారి ఫిర్యాదులను, సమస్యలను సామరస్యంగా వినాలి. తాత్సారం చేయకుండా ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయాలి. కేసులు నమోదు చేయడమే కాకుండా నిజాయితీగా దర్యాప్తు జరిపి, ప్రజలకు న్యాయం జరుగుతుందని విశ్వాసాన్ని కలిగించాలి. సామాన్యులను మిత్రులుగా చూసి, నిజాయితీ, క్రమ శిక్షణగా వ్యవహరించినప్పుడు పోలీసులు విధి నిర్వహణలో విజయం సాధించినట్టు గుర్తుంచుకోవాలి. నేనే చేయాలి అనే సహజ ధోరణి విడనాడాలి. అందరూ కలసికట్టుగా ఒక బృందంగా ఏర్పడి సమన్వయంతో పని చేస్తే ఆశించిన ఫలితాలు వస్తాయి. ఇందులో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో వారి విజ్ఞప్తులను, సలహాలను స్వీకరించడం ద్వారా చట్టపరిధిలో శాఖాపరంగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి.

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా విజయవాడ నగర ప్రజలకు, పోలీసు సిబ్బంది, అధికారులకు, హోంగార్డులు, తమ వంతు సహకారం అందిస్తూ వెన్నంటి ఉండే పోలీసు కుటుంబాలకు, మీడియ మిత్రులకు మా విజ్ఞప్తిని మన్నించి సహృదయంతో ఇక్కడకు విచ్చేసిన అందరు పెద్దలకు మరొకసారి నా శుభాకాంక్షలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మునుముందు పోలీసు అధికారులు, సిబ్బంది స్నేహ భావంతో, సేవా దృక్పదంతో విధులు నిర్వహించి నగరంలో శాంతి స్థాపనకు పాటుపడాలని, ఉన్నతమైన పురోగతి సాధించే దిశగా అడుగులు వేయాలని ఆశిస్తున్నాను.

**... జైహింద్ ...**